సాక్షి
అనకాపల్లి
బుధవారం । 22 । మే । 2024



రంగు మారిన తీరం

విశాఖ: నీలం రంగులో ఉండాల్సిన సాగర తీరం వాయుగుండం కారణంగా అకస్మాత్తుగా బురద రంగులోకి వచ్చింది.



అప్పన్నకు దాసుడి పూజలు

సింహాచలం: సింహాద్రి అప్పన్నకు మంగళవారం ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గరిష్ఠం/కనిష్ఠం
35.9/26.6

వాతావరణం

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

అప్పన్న ఆలయంలో నేడు, రేపు ఆర్జిత సేవలు రద్దు



సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం, గురువారం ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్టు సింహాచలం దేవస్థానం ఏఈవో ఎన్. ఆనంద్‌కుమార్ మంగళవారం తెలిపారు. 22న శ్రీనృసింహ జయంతి, స్వాతి నక్షత్ర హోమం నిర్వహిస్తున్న కారణంగా ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్టు తెలిపారు. అలాగే వైశాఖ పౌర్ణమి కావడంతో గురువారం కూడా ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్టు పేర్కొన్నారు. నమ్మాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా గురువారం రాత్రి 7గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయని తెలిపారు. భక్తులంతా ఈ విషయాలను గమనించాలని కోరారు.

నేడు కృష్ణాపురంలోని గోశాలలో శ్రీనృసింహ జయంతి

శ్రీ నృసింహ జయంతిని బుధవారం సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో విశేషంగా నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి గోశాలలో ఉన్న భారీ నృసింహుడి విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులంతా ఈకార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు.


రోలుగుంటలో తెలంగాణ ఏసీబీ అధికారుల సోదాలు



రోలుగుంటలో సోదాలు చేస్తున్న తెలంగాణ ఏసీబీ అధికారులు

రోలుగుంట: రోలుగుంటలో ఒక రైతు ఇంట్లో తెలంగాణ ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు చేశారు. హైదరాబాదులోని సీసీఎస్ డీఎస్పీ ఉమామహేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో అతని ఇంట్లో, బంధువుల ఇళ్లల్లో ఏసీబీ బృందాలు ఏక కాలంలో సోదాలు చేపట్టాయి. ఇందులో భాగంగా రోలుగుంటలో ఉమామహేశ్వరరావు దూరపు బంధువు దివంగత మద్దు తమ్మునాయుడు ఇంట్లో తనిఖీలు చేశారు. ఆయన భార్య నుంచి వారి ఇల్లు, భూములు తదితర ఆదాయ వనరుల వివరాలను సేకరించారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఐదుగురు సభ్యులతో కూడిన తెలంగాణ ఏసీబీ అధికారుల బృందం వచ్చి వివరాలు సేకరించారు. కేసు గురించి మీడియాతో మాట్లాడేందుకు వారు నిరాకరించారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు సంపద క్షేమం

- సత్ఫలితాలిస్తున్న పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు
- నియోజకవర్గ కేంద్రంలోనే అన్ని రకాల పరీక్షలు
- వ్యాధి నిర్ధారణతో సకాలంలో వైద్యం



శాంపిల్స్‌ను పరీక్షిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రం

నర్సీపట్నం: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు సత్ఫలితాలిస్తున్నాయి. నియోజకవర్గానికి ఒకటి నెలకొల్పాలన్నది లక్ష్యం కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంతవరకు 10 లేబొరేటరీలు అందుబాటులోకి వచ్చాయి. నర్సీపట్నం, భీమిలి, చింతపల్లి, చోడవరం, విశాఖపట్నం, సబ్బవరం, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, మాడుగులలో ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. కాన్‌స్టిట్యుయెన్సీ యానిమల్స్ డిసీజ్ డయాగ్నోస్టిక్ లేబొరేటరీ (సీఏడీడీఎల్)లను అగ్రిల్యాబ్‌లకు అనుబంధంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. పశువుల మూత్రం, పేడ, రక్తం, చర్మం, పాలు పరీక్షించడానికి ఆధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. ఒక ల్యాబ్ టెక్నీషియన్, అసిస్టెంట్ టెక్నీషియన్, అటెండరును నియమించారు. ఈ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్నాయి.

పైసా ఖర్చు లేకుండా..

వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లు అందుబాటులోకి రావడంతో పాడి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పశువులకు ఏ చిన్న రోగం వచ్చినా గతంలో ఎన్నో అవస్థలు పడేవారు. పశువులకు ఎంత పెద్ద రోగం వచ్చినా స్థానిక వైద్యులతో సరిపెట్టుకోవాల్సి వచ్చేది. విశాఖ వెళ్లి పరీక్షలు చేయించుకోవడం, ఫలితాల రిపోర్టు వచ్చాక వైద్యుల వద్దకు పరిగెత్తడం ఎంతో భారంగా ఉండేది. ఇప్పుడు ఎక్కడికక్కడ లేబొరేటరీల ఏర్పాటుతో పాడి రైతులు పైసా ఖర్చు లేకుండా పశువులకు పరీక్షలు చేయించి, సకాలంలో వైద్య సేవలు పొందగలుగుతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 9,67,529 పశువులు, 3,71,430 గొర్రెలు, 4,35,620 మేకలు, 5,278 పందులు ఉన్నాయి. వీటి నుంచి 2023–24లో లేబొరేటరీల ద్వారా అన్ని రకాల పరీక్షలకు 39,486 శాంపిల్స్ సేకరించాలని లక్ష్యం నిర్దేశించగా 45,443 శాంపిల్స్ సేకరించారు. పశువుల మూత్ర పరీక్షలు 350, పేడ పరీక్షలు 29,563, నులి పురుగుల నివారణ పరీక్షలు 4,420, రక్త పరీక్షలు 3,728, చర్మవ్యాధి పరీక్షలు 810, పెథాలజీ బయో కెమికల్ పరీక్షలు 434, పాల పరీక్షలు 956 నిర్వహించారు. క్షేత్రస్థాయిలో 34 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ ధ్రువీకరించిన తర్వాత రైతు భరోసా కేంద్రాలు, ల్యాబ్‌లకు అనుసంధానం చేస్తూ రూపొందించిన యాప్‌లో పరీక్షల ఫలితాలను అప్‌లోడ్ చేస్తున్నారు. వాటిని రైతు భరోసా కేంద్రాల వెటర్నరీ అసిస్టెంట్లు పరిశీలించి, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేస్తున్నారు.



వ్యాధి నిర్ధారణ కేంద్రంలో పరికరాలు

ల్యాబ్‌లో ఎక్విప్‌మెంట్.. వాటి వినియోగం

మైక్రోస్కోప్: రక్తం, పేడ పరీక్షలు నిర్వహించేటప్పుడు సూక్ష్మ కణాలను గుర్తించేందుకు వినియోగిస్తారు

సెంట్రిఫ్యూజ్: రక్తంలో సీరం, ప్లాస్మా వేరు చేయడానికి ఉపయోగిస్తారు

బయోకెమికల్ ఎనలైజర్: దీంతో సీరం సంబంధిత కిడ్నీ, లివర్, సుగర్ వ్యాధి పరీక్షలు చేస్తారు

ఇంక్యుబేటర్: పశువుల వ్యాధి నిర్ధారణకు సేకరించిన శాంపిల్స్‌కు బ్యాక్టీరియా సోకకుండా దీంట్లో ఉంచుతారు

ఆటోక్లేవ్: వీటితో పరికరాలను వేడి నీటితో శుభ్రం చేస్తారు

లేబొరేటరీ సేవలు వినియోగించుకోవాలి



లేబొరేటరీలు ఏర్పాటు కాకముందు శాంపిల్స్‌ను వ్యాధి నిర్ధారణ పరీక్షకు విశాఖపట్నం పంపించాల్సి వచ్చేది. ఫలితాల కోసం చాలా కాలం వేచి చూడాల్సి వచ్చేది. వ్యాధి నిర్ధారణ కేంద్రాలు అందుబాటులోకి రావడంతో సకాలంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలు రైతుకు అందజేసి, వెంటనే వైద్య సేవలు అందిస్తున్నాం. ఏ ఒక్క పశువు మరణించకుండా సకాలంలో వైద్య సేవలు అందించి కాపాడుతున్నాం. చాలామంది రైతులు లేబొరేటరీలను వినియోగించుకుంటున్నారు. ఇది మరింతగా పెరగాలి.

–డా.పి.మోహినీకుమారి,
ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఉప సంచాలకులు, విశాఖపట్నం

కార్డన్ అండ్ సెర్చ్..

జిల్లా అంతటా జల్లెడ పట్టిన పోలీసులు





నాగులాపల్లిలో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న నర్సీపట్నం డీఎస్పీ మోహన్

- కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో నియంత్రణ చర్యలు
- సరైన పత్రాలు లేని వందకుపైగా వాహనాలు సీజ్

నర్సీపట్నం/ అనకాపల్లి/మునగపాక: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే సమయం సమీపిస్తున్నందున శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి బీసీ కాలనీ, పెదబొడ్డేపల్లిలో డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్ ఆధ్వర్యంలో ముఖ్యమైన కూడళ్లు, గ్రామ శివార్లు, అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల ఇళ్లు, పలు షాపులను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మోహన్ మాట్లాడుతూ కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఈ దాడుల్లో దొరికిన నిందితుడు బొంతు అప్పారావును పాయకరావుపేట పోలీసులకు అప్పగించామన్నారు. సరైన పత్రాలు లేని 68 బైక్‌లు, కారు, ఆటో, బొలెరో వాహనం సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో టౌన్, రూరల్ సీఐలు కాంతికుమార్, హరి, ఎస్సైలు సుధాకర్, ఉమామహేశ్వరరావు, భీమరాజు, డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగులాపల్లిలో..

మునగపాక మండలం నాగులాపల్లిలో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ నేతృత్వంలో యలమంచిలి సీఐ గఫూర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేని 41 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ పి.ప్రసాదరావు పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

అనకాపల్లి మండలం సుబ్రమణ్యకాలనీ, డీబీ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీలు చేశారు. 10 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు సీజ్ చేశారు. పట్టణ సీఐ జి.శంకరరావు, ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అనకాపల్లిలో సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

కొలువుదీరిన మోదకొండమ్మ



ఘటాలను శిరస్సున పెట్టుకుని సతకంపట్టు వద్దకు తీసుకొస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు, కమిటీ సభ్యులు, భక్తులు

- సతకంపట్టు వద్దకు చేరిన అమ్మవారి ఘటాలు, పాదాలు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఘటాల రూపంలో మంగళవారం మహారాజుల కోట ప్రాంగణంలో ఉన్న సతకంపట్టు వద్ద కొలువు దీరారు. ఆలయ సిద్ధాంతి భమిడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఉదయం 9.05 గంటలకు ఘటాలు, పాదాలను ఆలయం వద్ద నుంచి తోడ్కొని వచ్చారు. వాటిని శిరస్సున పెట్టుకొని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధు శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడియ్యనాయుడులతోపాటు 16 మంది ఉత్సవ కమిటీ సభ్యులు ముందు నడిచారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 150 మంది మహిళల కోలాటాల నడుమ అధిక సంఖ్యలో భక్తులు వెంటవచ్చారు. అమ్మవారి ఘటాలు, పాదాలు ఉదయం 10.15 గంటలకు సతకంపట్టు వద్దకు చేరుకున్నాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారి కొలువు అక్కడే ఏర్పాటు చేశారు. నెల రోజులపాటు అమ్మవారు అక్కడే ఉండి భక్తులకు దర్శనమిస్తారు. వచ్చే నెల 18వ తేదీన పండగ రోజు తిరిగి ఆలయానికి ఘటాలు, సంబరాల రూపంలో చేరుకోవడంతో అమ్మవారి నెల రోజుల పండగ ముగుస్తుందని కమిటీ తెలిపింది.



మోదకొండమ్మ ప్రతిరూపమైన ఘటాల వెంట మహిళల కోలాటాలతో నడుస్తున్న భక్తులు

శ్రీవారికి చక్రస్నానం



శ్రీనివాసుడికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు

మురళీనగర్ (విశాఖ): కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారికి చక్రస్నానం నిర్వహించారు. తెల్లవారుజామునుంచి వైభవుడికి ఉదయాస్తమాన సేవలు చేశారు. ఉదయం 5గంటలకు వైభవుడికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, పుణ్యాహవచనం, ఋత్విక్‌వరుణ, రక్షాసూత్రబంధన, మృత్స్యంగ్రహణం, అంకురార్పణ, పతాక ప్రతిష్ఠ, విశేష హోమాలు, మహానివేదన, మంగళాశాసనం నిర్వహించారు. శ్రీవారి ఉత్సవ విగ్రహంతో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామికి చక్రస్నానం చేశారు. ఈ పవిత్ర జలాలను భక్తులు స్వీకరించి తరించారు. బుధవారం ఉదయం 6గంటలకు వైభవుడవికి పౌర్ణమి పంచామృతాభిషేకం అనంతరం సర్వాంగ వజ్రకవచంతో శ్రీవారి దర్శనం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ చెప్పారు.

ఇక ప్రైవేటు డ్రైవింగ్ లైసెన్స్‌లు

- లైసెన్స్‌ల జారీకి అనుమతి
- టెస్టింగ్ సెంటరుకు మూడెకరాల స్థలం తప్పనిసరి
- వాటిని డీటీసీ/ఆర్టీవోలు పర్యవేక్షించేలా ఏర్పాట్లు
- కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ సన్నద్ధం



వెహికల్ టెస్ట్ డ్రైవింగ్ సెంటర్ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: ఇన్నాళ్లు డ్రైవింగ్ లైసెన్స్‌లు ప్రభుత్వ అధీనంలోని రవాణా శాఖ ద్వారా జారీ అవుతున్నాయి. ఇకపై వీటిని ప్రైవేటు సంస్థలు కూడా జారీ చేసే రోజులొస్తున్నాయి. ఇందుకు కేంద్ర ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీని ప్రైవేటు సంస్థలకు కూడా ఇవ్వాలని గత ఏడాదే నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. ఇలా ప్రైవేటు డ్రైవింగ్ టెస్ట్ సెంటరు ఏర్పాటుకు అవసరమైన కొన్ని విధి విధానాలను రూపొందించింది. టూ వీలర్ డ్రైవింగ్ ట్రాక్‌కు కనీసం ఒక ఎకరం, ఫోర్ వీలర్, అంతకు మించిన వాహనాల డ్రైవింగ్ ట్రాక్‌కు అయితే మూడెకరాల స్థలం ఉండాలని నిర్దేశించింది. దీనివల్ల నగరాలు, పట్టణాల్లో టెస్టింగ్ ట్రాక్ సెంటర్లను ఏర్పాటు చేయాలంటే భూముల ఖరీదు రూ.కోట్లలో ఉండడం, తక్కువ ధరలో లభ్యం కాకపోవడం వల్ల అంతగా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అనుకున్న స్థాయిలో అది కార్యరూపం దాల్చలేదు. దీనిపై గత సంవత్సరం విశాఖ జిల్లా రవాణా శాఖ అధికారులు ఒక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. ప్రైవేటు వ్యక్తులు/సంస్థలకు డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ తీరు తెన్నులను ఔత్సాహికులకు వివరించారు. అయినప్పటికీ ఎవరూ వీటి కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఇదే పరిస్థితి మిగిలిన రాష్ట్రాలు, ప్రాంతాల్లోనూ నెలకొంది.

ఈ నేపథ్యంలో నిబంధనలను కాస్త సరళతరం చేస్తూ ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి అమలయ్యేలా కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ రవాణా కార్యాలయాల (ఆర్టీవో)కు అదనంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. అనుమతి పొందిన ఈ ప్రైవేటు డ్రైవింగ్ టెస్ట్ సెంటర్ల నిర్వాహకులే టెస్ట్‌లను నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్‌లను జారీ చేస్తారు. ప్రస్తుతానికి ఈ సెంటర్లను జిల్లాకు ఒకటి చొప్పున మంజూరు చేసే అవకాశం ఉంది. ఈ టెస్టింగ్ సెంటర్లలో వీడియో కెమెరాలు, రికార్డింగ్ సదుపాయం కూడా ఉంటుంది. ఈ సెంటర్ల నిర్వాహకులు ఇష్టానుసారం డ్రైవింగ్ లైసెన్స్‌లను జారీ చేయకుండా సంబంధిత డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ)/ఆర్టీవోలు పర్యవేక్షించేలా వాటిని అనుసంధానం చేస్తారు. కాగా ప్రైవేటు టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి, విధి విధానాలు, పూర్తి స్థాయి మార్గదర్శకాలు రాగానే అవసరమైన చర్యలు తీసుకుంటామని విశాఖ జిల్లా డీటీసీ జీసీ రాజారత్నం 'సాక్షి'కి చెప్పారు.

ఇందుకు ఏం కావాలంటే?

- టూ వీలర్ టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌కు ఒక ఎకరం, ఫోర్ వీలర్ ట్రాక్ కోసం రెండు ఎకరాల స్థలం అవసరం.
- ఈ సెంటర్‌లో డ్రైవింగ్ లైసెన్స్‌కు అవసరమైన సదుపాయాలు విధిగా సమకూర్చాలి.
- ట్రైనర్‌కు కనీసం హైస్కూలు డిప్లొమా, ఐదేళ్ల డ్రైవింగ్ అనుభవంతో పాటు బయోమెట్రిక్, ఐటీపై అవగాహన ఉండాలి.
- లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) లైసెన్స్‌కు విధిగా నాలుగు వారాల్లో 29 గంటలు, ఎనిమిది గంటలు థియరీ, 21 గంటలు ప్రాక్టికల్‌పైన శిక్షణ ఇవ్వాలి.
- అలాగే హెవీ మోటార్ వెహికల్ (హెచ్ఎంవీ)కైతే ఆరు వారాల్లో 38 గంటల శిక్షణ ఇవ్వాలి. ఇందులో ఎనిమిది గంటలు థియరీ, 31 గంటలు ప్రాక్టికల్ శిక్షణ తప్పనిసరి. వీటి ఏర్పాటుపై ఆసక్తి ఉన్నవారు 'సారథి' పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీపై సమీక్ష

అనకాపల్లి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మంగళవారం వెబ్ ఎక్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24వ తేదీ నుంచి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రశ్నాపత్రాలు, సామగ్రిని భద్రపరిచిన స్టోరేజ్ పాయింట్ల నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించేటప్పుడు, పరీక్షల సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు పర్యవేక్షించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేసేలా గట్టిగా చర్యలు చేపట్టాలన్నారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూలో సందడి

ఆరిలోవ (విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కుకు వేసవి తాకిడి నెలకొంది. కొద్ది రోజులుగా జూ పార్కు సందర్శకులతో సందడిగా మారింది. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో పిల్లలు, పెద్దలు వందలమంది జూని సందర్శిస్తున్నారు. మంగళవారం మరింత సందడి నెలకొంది. పిల్లల పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో నగరంలో వివిధ ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాల్లో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జూ పార్కును సందర్శించారు. కుటుంబ సభ్యులంతా కలసి రోజంతా గడిపారు. వారు వెంటతీసుకెళ్లిన ఆహారం చెట్ల కింద కూర్చొని తినడంతో కార్తీక మాసంలో పిక్నిక్‌లను తలపించింది. ఇక్కడ కోతులు, ఆఫ్రికన్ జాతి కోతులు, పులులు. సింహాలు, నీటి ఏనుగులు, జింకలు, లవ్‌బర్డ్స్, నెమళ్లు, పాములు, తాబేళ్లు తదితర వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద వీరితో సందడిగా మారింది. ఇటీవల పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో అలీపూర్ జూ పార్కు నుంచి ఇక్కడకు తీసుకువచ్చిన జిరాఫీలు సందర్శకులను మరింత అలరించాయి. వాటి ఎన్‌క్లోజర్‌లో తిరుగుతూ ఒకదానితో మరొకటి పోట్లాడుకొంటూ సందర్శకులను కనువిందు చేశాయి. తెల్ల పులులు వాటి ఎన్‌క్లోజర్‌లో తిరుగుతూ గాంగ్రింపులతో హోరెత్తించాయి. దీంతో వాటి ఎన్‌క్లోజరు వద్ద సందర్శకులకు సరదాగా గడిపారు.



నేను మెల్లగా ఎలాగోలా బతికేయడానికి రాలేదు.. జూని ఏలేద్దామని వచ్చా..



ఏంటి మావా విశేషాలు..

క్లుప్తంగా

ఇరాన్ అధ్యక్షుడి మరణానికి వాల్తేర్ డివిజన్ సంతాపసూచిక



రైల్వేస్టేషన్ వద్ద గల భారీ జాతీయ పతాకాన్ని సగం వరకు అవనతం చేసిన అధికారులు

తాటిచెట్లపాలెం(విశాఖ జిల్లా): ఇటీవల హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మరణానికి సూచికగా వాల్తేర్ డివిజన్ రైల్వేస్టేషన్ వద్ద గల జాతీయ పతాకాన్ని సగం వరకు అవనతం చేశారు. వాల్తేర్ డివిజన్ ఒక దినం సంతాప దినంగా పాటించింది.

అన్నమయ్య కీర్తనల శిక్షణ ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి

అగనంపూడి: అన్నమాచార్యుని సంకీర్తనలు ఆనందానుభూతి కలిగిస్తాయని టీటీడీ గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి పునరావాస కాలనీ గవర వీధిలోని రామాలయంలో కాపారపు ఫౌండేషన్, గీతాచార్య భక్తి గీతాంజలి గౌరీ సేవా సంఘం సంయుక్తంగా నిర్వహించిన వేదర్ష అన్నమాచార్య సంకీర్తన శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన సంకీర్తన యజ్ఞం నిర్వహించనున్నామని తెలిపారు.

మండే ఎండ.. జాగ్రత్తలే అండ..

- వేసవిలో వాహనాల భద్రత ఎంతో ముఖ్యం
- బైక్‌లకు ఫుల్ ట్యాంక్ పెట్రోల్ వద్దు
- ఎండలో దూర ప్రయాణాలు శ్రేయస్కరం కాదు



రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో ఇలా..

డాబాగార్డెన్స్: ఎండలు మండుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేడి భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండ నుంచి రక్షణకు మనం ఎలా జాగ్రత్తలు పాటిస్తామో.. వాహనాలను సైతం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. వాహనాలు ఎండలో గంటల సమయం ఉండటం వల్ల వాటి రంగు వెలిసిపోతుందని, పెట్రోల్ ఆవిరయ్యే అవకాశం ఉందని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. వాహనాలకు ట్యాంక్ నిండా పెట్రోల్ పట్టిస్తే ఒక్కో సారి పేలే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు.

ద్విచక్ర వాహనాల రక్షణ ఇలా..

- వాహనాలను ఎక్కువ సేపు పార్కింగ్ చేయాల్సి వస్తే చెట్టు నీడన గానీ, షెడ్లలో గానీ పెట్టుకోవాలి. లేదా కవర్లు కప్పి ఉంచాలి.
- ఎండ వేడికి రంగు వెలిసిపోయి కొత్త వాహనాలు సైతం పాతవిగా కనిపిస్తాయి.
- అధిక ఉష్ణోగ్రతల వల్ల టైర్లలో గాలి తగ్గిపోతుంది. వారానికి ఒకసారి గాలి తనిఖీ చేయించుకోవడం మంచిది.
- గాలి ఎక్కువ కొట్టించడం వల్ల వేడికి టైర్లు కరిగి పేలిపోతాయి. తగిన మోతాదులో మాత్రమే గాలి నింపుకోవాలి.
- ద్విచక్ర వాహనాలు ఎక్కువ సమయం ఎండలో ఉంచితే పెట్రోల్ ఆవిరి అయిపోయే అవకాశం ఉంటుంది.
- వేసవిలో పగలు కన్నా సాయంత్రం వేళల్లో పెట్రోలు కొట్టించడం మంచిది.
- గాలి పట్టే విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే టైర్ల మన్నిక తగ్గిపోతుంది. తద్వారా పెట్రోల్ ఎక్కువ ఖర్చయ్యే ప్రమాదం ఉంది.
- వేసవిలో ద్విచక్ర వాహనాలపై దూర ప్రయాణం చేయడం తగ్గించుకుంటే మేలు.
- దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వాహనాల వేగానికి, ఉష్ణోగ్రతల వేడికి ఇంజిన్ రెండింతలు వేడెక్కే అవకాశం ఉంటుంది. అందుకోసం కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత ఇంజిన్ కాసేపు ఆపుకుంటే వాహనం మన్నిక కాలం పెరుగుతుంది. నిర్ణీత గడువులోపు ఇంజిన్ ఆయిల్ చెక్ చేసుకోవాలి.

వేసవిలో ఫుల్‌ట్యాంక్ వద్దు



ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. బైక్‌లకు ఫుల్ ట్యాంక్ చేయించడం వల్ల పేలిపోయే ప్రమాదం ఉంది. రెండు లీటర్ల పెట్రోలు వరకు వేయించుకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉండదు. ఒక వేళ బైక్ ఎండలో పెట్టాల్సిన అవసరం ఏర్పడితే ఏదైనా పాడవాటి క్లాత్‌ను ట్యాంక్‌పై కప్పి ఉంచితే సరిపోతుంది. లేదంటే ఎండలకు ఆయిల్ ట్యాంకర్ హీటెక్కి పేలిపోయే ప్రమాదం ఉంది.

– గౌతమ్, మెకానిక్, కలెక్టర్ కార్యాలయ ప్రాంతం

ఎక్కువ దూరం ప్రయాణించొద్దు..

ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల బైక్‌ల ఆయిల్ ట్యాంకులు పేలిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పెట్రోల్ పోయించేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడడం, బైక్‌ను ఎండలో ఉంచడం కారణంగా ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బైక్‌ను మధ్యాహ్నం సమయంలో నీడలో పార్కు చేయాలి. ఎండలో ఎక్కువ దూరం ప్రయాణించకపోవడం మంచిది.

– అక్బర్, మెకానిక్, అక్కయ్యపాలెం

పెద్ద వాహనాలు ఇలా..

- కార్లు, లారీలు ఇతర భారీ వాహనాల విషయంలో రేడియేటర్లలో నీళ్లను తరచూ తనిఖీ చేసుకోవాలి.
- నీళ్ల కంటే కూలెంట్ ఆయిల్ వాడటం మంచిది.
- వేడికి ఇంజిన్ ఆయిల్ తగ్గే అవకాశాలు ఉంటాయి. తప్పనిసరిగా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి.
- కార్లలో పెట్రోల్, డీజిల్‌తో పాటు ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా వాహనాలు నడిపేవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అటువంటి వాహనదారులు వేసవిలో గ్యాస్ కిట్‌ను ఉపయోగించకుండా ఉంటే ఉత్తమం.
- ఏసీ నిలబడాలంటే కారు అద్దాలకు క్లాత్ మ్యాట్స్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండాకాలం వెళ్లే వరకూ భారీ వాహనాలకు నూతన టైర్లు వాడితే మేలు. లేదంటే దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పాత టైర్లలో గాలి తగ్గి.. పేలిపోయే ప్రమాదం ఉంది.

ఎక్కడ చూసినా ధనస్వామ్యమే..

- ఆదికవి నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ ముత్యాలనాయుడు



ప్రధానికి పంపిన లేఖ చూపిస్తున్న ప్రొఫెసర్ ముత్యాలనాయుడు

డాబాగార్డెన్స్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఎక్కడా కనిపించలేదని, ఎక్కడ చూసినా ధనస్వామ్యమేనని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కట్టడి చేయాల్సిన వారే డబ్బులు పంపిణీ చేసి ఓటర్లకు గాలం వేయడం దారుణమన్నారు. దేశంలో ఎంతో సాధించామనే చెప్పే ప్రధాని మోదీ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇంత జరుగుతున్న చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ విషయానికి సంబంధించి మోదీకి పంపిన లేఖను మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు విడుదల చేశారు. ఇటీవల కాలంలో ఓటర్లకు ప్రత్యక్ష డబ్బు బదిలీలు బాగా పెరగడంతో ప్రజాస్వామ్యం తుప్పు పట్టిందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థులు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సగటున రూ.50 కోట్లు ఖర్చు చేశారని, ప్రతి ఓటరుకు సగటున రూ.1, 500 నగదు ఇచ్చారని ఆరోపించారు. ఒక్క రాష్ట్రంలోనే సుమారు 3 కోట్ల మంది ఓటర్లకు ఇలా నగదు అందజేశారని, దీన్ని బట్టి దేశంలో ఏ మేరకు నగదు పంపిణీ చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల్లో సంస్కరణలు తీసుకురావాలని మోదీకి పంపిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

తొలకరిలో భూసార పంటలు మేలు



మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి: తొలకరి వర్షాల్లో నేల దుక్కు దున్నుకుని భూసారాన్ని పెంచే పంటలు వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు ముందు జనుము (12–15 కిలోలు, ఎకరానికి), జీలుగ (ఎకరానికి 10–12 కిలోలు), పిల్లి పెసర(ఎకరానికి 10–12 కిలోలు), పెసర (ఎకరానికి 8–10 కిలోలు), పచ్చిరొట్ట పైరులను వేసుకోవాలన్నారు. వీటి సాగుకు ఇది అనువైన సమయం అన్నారు. పచ్చిరొట్ట పంటగా వేసుకోవడానికి అనువైన జనుము జేఆర్‌జే 610 పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉందన్నారు. 120 రోజుల వయసు గల చెరకు మొక్కతోటలో తేమను ఉపయోగించుకుని మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయాలని సూచించారు. వర్షాధార చెరకు పంటకు నేల తయారీ చేసుకోవాలన్నారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని నువ్వు సాగుకు రైతులు నేలను దున్ని, అధిక దిగుబడినిచ్చే వైఎల్ఎం 17, 66 రకాలను ఈ నెలాఖరులోపు విత్తుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, డి.అనిల్‌కుమార్, ఎ.అలివేణి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరాల్సిన పలు రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ రైళ్లు అంతే ఆలస్యంగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

- షాలిమర్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు బయలుదేరాల్సిన షాలిమర్–సికింద్రాబాద్ (07226) స్పెషల్ సుమారు 12 గంటలు ఆలస్యంగా రాత్రి 10.05 గంటలకు బయలుదేరింది.
- ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరులో మంగళవారం ఉదయం 10.15 గంటలకు బయలుదేరాల్సిన ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు–అగర్తలా (12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు 24 గంటలు ఆలస్యంగా బుధవారం ఉదయం 10.15 గంటలకు బయలుదేరుతుంది.
- తాంబరంలో మంగళవారం సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరాల్సిన తాంబరం- సంత్రగచ్చి (22842) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 11 గంటలు ఆలస్యంగా బుధవారం ఉదయం 7.15గంటలకు బయలుదేరింది.
- విశాఖలో మంగళవారం రాత్రి 8 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్ సుమారు ఐదున్నర గంటలు ఆలస్యంగా మధ్య రాత్రి 1.30 గంటలకు బయలుదేరింది.



రోగి మృతిపై విచారణ



ఆర్ఎంపీ వైద్యుడిని విచారణ చేస్తున్న సీనియర్ వైద్యాధికారి ప్రశాంతి

గొలుగొండ: మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన నెల్లూరి సత్యనారాయణ మృతిపై నర్సీపట్నం డివిజన్ సీనియర్ వైద్యాధికారి ప్రశాంతి, కృష్ణదేవిపేట, గొలుగొండ వైద్యాధికారులు హరి ప్రవీణ్, శ్యామ్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. వారం రోజుల క్రితం కృష్ణదేవిపేట(ఏఎల్‌పురం)లో ఆర్ఎంపీ వైద్యుడు రామ్‌దాస్ వద్ద సత్యనారాయణ వైద్య సేవలు పొందాడు. ఇంతలో పచ్చకామెర్లు ముదిరి కోమాలోకి వెళ్లిపోవడంతో ఆర్ఎంపీ వైద్యుడు సలహా మేరకు కుటుంబ సభ్యులు విశాఖ కిమ్స్‌లో చేర్పించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉందని కిమ్స్ వైద్య సిబ్బంది సూచన మేరకు కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ సోమవారం తెల్లవారు మృతి చెందాడు. దీనిపై ఆర్ఎంపీ వైద్యుడు సరైన వైద్యం చేయకపోవడం వల్లే సత్యనారాయణ మృతి చెందాడని వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో లింగంపేటలో మృతుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకున్న వైద్య సిబ్బంది అనంతరం ఆర్ఎంపీ వైద్యుడిని కృష్ణదేవిపేటలో విచారణ నిర్వహించారు. పూర్తి స్థాయి నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తున్నట్లు సీనియర్ వైద్యాధికారి తెలిపారు.

బస్సును ఢీకొట్టిన బైక్

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో మరణించిన వ్యక్తి

నక్కపల్లి: మండలంలోని ఉద్దండపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం బస్సును బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం... రేబాక నుంచి అచ్యుతాపురంలో బ్రాండిక్స్ కంపెనీకి వెళ్తున్న బస్సు ఉద్దండపురంలో జాతీయ రహదారిపై మలుపు తిరుగుతుండగా.. తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న బైకు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న వినయ్(33) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెనుక కూర్చున్న దుర్గేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిద్దరు విశాఖ నగరానికి చెందిన వారని తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గోడ కూలి వ్యక్తి మృతి



స్థానికులను విచారిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ బాలసూర్యారావు (ఇన్‌సెట్) గురువులు(ఫైల్)

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- వివాహేతర సంబంధమే కారణమా?

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో ఓ ఇంటి గోడ కూలి.. అదే గ్రామానికి చెందిన మైలపల్లి గురువులు(35) తీవ్రంగా గాయపడి సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలివీ.. ముత్యాలమ్మపాలేనికి చెందిన గురువులు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువులకు దిబ్బపాలెంలో నివాసం ఉంటున్న ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో గురువులు దిబ్బపాలెంలో ఉంటున్న వివాహిత ఇంటికి వచ్చాడు. కొంతసేపటి తర్వాత ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. రాత్రి 9.15 గంటల సమయంలో ఆమె ఇంటికి ఎదురుగా రెండో అంతస్తుపైకి వెళ్లాడు. అయితే అక్కడ నిర్మించిన రక్షణ గోడ కూలి కింద పడిపోయింది. ఆ గోడతో పాటు గురువులు కూడా కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో గురువులు కాలి తొడ భాగం విరిగిపోగా మోచేయి తీవ్రంగా దెబ్బతింది. తీవ్రంగా గాయపడిన గురువుల కాలి నుంచి విపరీతంగా రక్తస్రావం జరగడం వల్ల స్పృహ కోల్పోయాడు. స్థానికులు ఈ సమాచారాన్ని బంధువులకు చేరవేయడంతో.. తీవ్రంగా గాయపడిన గురువులను చికిత్స నిమిత్తం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యం పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని సీఐ బాలసూర్యారావు చెప్పారు. గురువులకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ప్రమాదం అనుమానాస్పదంగా ఉండడంతో పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ ఎస్.బాలసూర్యారావు గ్రామంలో మంగళవారం విచారణ చేపట్టారు. గోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదాన్ని అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దేశంలో మొదటి హైడ్రోజన్ నగరంగా విశాఖ

- ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్



వర్క్ షాపులో పాల్గొన్న ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్

బీచ్‌రోడ్డు: భారతదేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ నగరంగా విశాఖ అవతరించేందుకు సిద్ధంగా ఉందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ విశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ అన్నారు. ఐఐపీఈ విశాఖపట్నం, అమెరికాకు చెందిన స్టోనీ బ్రూక్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా మంగళవారం హైడ్రోజన్ అండ్ గ్లోబల్ డీకార్బనైజేషన్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించాయి. ఈ వర్క్‌షాపులో ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ హైడ్రోజన్‌ను అభివృద్ధి చేయడంలో పరిశ్రమలు, విద్యా సంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. విశాఖలో హైడ్రోజన్ ఉత్పత్తి ప్రాజెక్ట్‌కు ఎన్టీపీసీ మద్దతు ఇచ్చిందన్నారు. 23 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసి.. 2032 నాటికి 130 జీడబ్ల్యూ స్థాయికి ఈ ప్రాజెక్టు చేరనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టోనీ బ్రూక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దేవిందర్ మహాజన్, ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ డైరెక్టర్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ పూర్వ సీఐపై ఫోర్జరీ కేసు

అగనంపూడి: దువ్వాడ పూర్వ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావుపై ఫోర్జరీ కేసు నమోదైంది. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివీ.. దువ్వాడ సీఐగా గతంలో పనిచేసిన బి.శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు, గాజువాక ఎస్ఐ సతీష్ ఈ ఏడాది జనవరిలో టి.దేవాడలో పేకాట స్థావరంపై దాడి చేశారు. తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై అప్పటి దువ్వాడ సీఐ బి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. ఈ సమయంలో దాడిలో పాల్గొన్న అధికారుల సంతకాలు తీసుకోవాల్సి ఉండగా.. వారి సంతకాలు ఎఫ్ఐఆర్‌పై లేకుండానే వేరే సంతకాలతో కేసు నమోదు చేశారు. దీంతో స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు, గాజువాక ఎస్ఐ సతీష్ ఫిర్యాదు మేరకు సీఐ ఎర్రంనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో డిగ్రీ విద్యార్థి డ్రైవింగ్

- రోడ్డు ప్రమాదంలో విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం



మృతుడు వెంకటపతిరాజు

తగరపువలస: రోడ్డు ప్రమాదంలో భీమిలి మండలం తాళ్లవలసకు చెందిన విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ దండు వెంకటపతిరాజు దుర్మరణం చెందాడు. వలందపేట సర్వీస్‌రోడ్డులో పైడితల్లమ్మ ఆలయం ఎదురుగా మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. వెంకటపతిరాజు తన ద్విచక్రవాహనంపై తగరపువలస నుంచి తాళ్లవలస వెళ్తుండగా అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన డిగ్రీ విద్యార్థి వర్రి నందకిశోర్ కారు డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చి ఢీకొట్టాడు. తర్వాత వంద మీటర్ల వరకు ద్విచక్రవాహనాన్ని ఈడ్చుకుపోయాడు. ప్రమాద సమయంలో విద్యార్థి మద్యం మత్తులో ఉండటమే కాకుండా పక్కనే మద్యం బాటిల్ ఉందని ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపారు. వెంకటపతిరాజు పువ్వుల కోసం తగరపువలస వచ్చి.. అనంతరం సంగివలస ముగ్గురు అమ్మవార్ల దర్శనం చేసుకున్నాడు. ఇది జరిగిన ఐదు నిమిషాల్లోనే ప్రమాదానికి గురవడంతో తాళ్లవలస వాసులు విషాదంలో మునిగిపోయారు. ఆ విద్యార్థి చోడవరం నుంచి విశాఖ బీచ్‌కు వెళ్లి అక్కడ నుంచి భీమిలి బీచ్‌కు వెళ్లేందుకు తగరపువలస వైపు వస్తూ.. ఈ ప్రమాదానికి కారణమయ్యాడు. ఆ సమయంలో నందకిశోర్ పక్కన ఓ యువతి ఉంది. ఆమెను ప్రేమ వివాహం చేసుకున్నట్టు అతను పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. విశ్రాంత హెడ్ కానిస్టేబుల్‌కు భార్య మల్లీశ్వరి, కుమార్తె సాయిలక్ష్మి, కుమారుడు ప్రసాద్ ఉన్నారు. ప్రసాద్ ప్రస్తుతం లండన్‌లో ఉంటున్నారు. బుధవారం ఆయన తాళ్లవలస చేరుకోనున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన హస్తకళలకు మహర్దశ

- అమెజాన్ ఇండియాతో విశాఖ అటవీ శాఖ ఒప్పందం
- గిరిజన సంఘాల బలోపేతంపై దృష్టి
- అమెజాన్ కరిగర్ కార్యక్రమం కింద భాగస్వామ్యం
- గిరిజన సాంస్కృతిక పరిరక్షణ, గిరి కళాకారుల సాధికారతకు అవకాశం
- త్వరలోనే అమెజాన్‌లో గిరిజన హస్త కళాకృతులు, అటవీ ఉత్పత్తుల విక్రయాలు





విశాఖ సిటీ: గిరిజన హస్తకళలకు మహర్దశ పట్టనుంది. వారి వారసత్వం, నైపుణ్యం విశ్వవ్యాప్తమవనుంది. గిరిపుత్రుల చేతుల్లో రూపుదిద్దుకున్న కళాకృతులు దేశ ప్రజలకు చేరువకానున్నాయి. గిరిజన కళాకారులకు ఉపాధి కల్పించేందుకు విశాఖ అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. గిరిజనుల హస్త కళాకృతులకు ప్రపంచ మార్కెట్ అవకాశాలు సృష్టించేందుకు ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియాతో ఒప్పందం చేసుకుంది. గిరిజన సమాజ, ఆర్థికాభివృద్ధికి అమెజాన్ కరిగర్ కార్యక్రమం కింద భాగస్వామ్యమైంది. అమెజాన్ ప్లాట్‌ఫారం ద్వారా గిరిజన కళాకారులు తయారు చేసే వస్తువులు, అటవీ ఉత్పత్తులను ప్రపంచ ప్రేక్షకుల చెంతకు తీసుకువెళ్లనుంది.

అమెజాన్‌లో గిరిజన ఉత్పత్తులు

త్వరలోనే అమెజాన్ ప్లాట్‌ఫారంలో విశాఖ గిరిజనుల హస్తకళలు, అటవీ ఉత్పత్తుల విక్రయాలు ప్రారంభంకానున్నాయి. కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం మధ్యలో ఉన్న శంభువానిపాలెం కుగ్రామంలో నివసించే గిరిజన వర్గాల గొప్ప వారసత్వం, నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలన్న లక్ష్యంతో విశాఖ అటవీ శాఖ అధికారులు కీలక అడుగు వేశారు. వారి చేతితో తయారు చేసే వస్తువులకు అమెజాన్ ద్వారా మార్కెట్ కల్పించడం ద్వారా స్థానిక కమ్యూనిటీలకు స్థిరమైన జీవనోపాధిని అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

ఈ–కామర్స్ హబ్ ఏర్పాటు

అమెజాన్ కరిగర్ ప్రోగ్రామ్ కింద గిరిజన సభ్యులకు విలువ జోడింపు, ప్యాకేజింగ్, బ్రాండింగ్ వంటి అంశాల్లో సమగ్ర శిక్షణ అందించనున్నారు. తద్వారా గిరిజన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. ఇందుకోసం అటవీ శాఖ ద్వారా ఈ–కామర్స్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రైమరీ, సెకండరీ ప్యాకేజింగ్, స్టోరేజ్, డిస్పాచ్, ఆర్డర్ ప్రాసెసింగ్‌తో పాటు వివిధ కార్యకలాపాలకు ఈ హబ్ కీలకమైన కేంద్రంగా పనిచేయనుంది.

తొలుత సంప్రదాయ ఉత్పత్తులపై దృష్టి

అమెజాన్ ప్లాట్‌ఫారం ద్వారా తొలుత కొన్ని ఉత్పత్తులపైనే దృష్టి సారించనున్నారు. ఇందులో ప్రధానంగా అంతరించిపోతున్న కళారూపాలతో పాటు ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో లేని ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చే వాటిపై దృష్టి సారించారు. ఆవు పేడ కుండలు, పేపర్ మాస్కులు, సంప్రదాయ కళాకృతులను ప్రదర్శించే పోస్ట్‌కార్డ్‌లు వంటి అటవీ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించడంపై ఫోకస్ చేయనున్నారు. ప్రస్తుతం అమెజాన్ కరిగర్ ద్వారా దేశవ్యాప్తంగా 18 లక్షల మంది కళాకారులు తయారు చేసిన రెండు లక్షలకు పైగా చేతి ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజన కళాకారుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభించడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి దోహదం అవుతుందని విశాఖ అటవీ శాఖ అధికారి అనంత్ శంకర్ తెలిపారు.

తాటి ముంజ.. తింటే మజా


యలమంచిలి బస్ కాంప్లెక్స్ వద్ద


నోరూరించే తాజా తాటి ముంజలు


తాటి ముంజల విక్రయం

- వేసవిలో నోరూరిస్తున్న ఐస్ ఆపిల్
- పట్టణాలు, మండల కేంద్రాల్లో జోరుగా విక్రయాలు
- వేసవి తాపాన్ని తగ్గించడంలో మేటి

వేసవి వచ్చిందంటే చాలు.. తాటి ముంజల కోసం ఆరాటపడని మనసు ఉండదు. వేసవి దాటితే కొనాలన్నా ఇవి దొరకవు. అందుకే వీటికి అంత క్రేజ్. దాహార్తిని తీర్చడం, డీహైడ్రేషన్ నివారించడంతోపాటు వీటిలో పోషకాలు కూడా ఎక్కువే. దీంతో ఈ సీజన్లో ధర ఎంతైనా.. కొనేందుకు వెనుకాడరు. ప్రస్తుతం తాటి ముంజలకు ముమ్మర సీజన్ నడుస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

యలమంచిలి రూరల్: మండే ఎండల్లో లేత తాటి ముంజల రుచి గురించి ప్రత్యేకించి చెప్పాలా? అందుకే వేసవి వచ్చిందంటే చాలు తాటి ముంజలకు మంచి డిమాండ్. పట్టణాలు, మండల కేంద్రాల్లో తాటి ముంజల విక్రయాలు జోరందుకున్నాయి. వేసవిలో శీతల పానీయాలకంటే శరీరానికి చల్లదనాన్ని చేకూర్చే ఐస్ ఆపిల్(తాటి ముంజలు) కొనుగోలుకే జనాలు ప్రాధాన్యత ఇస్తున్నారు.

తాజా తాజా ముంజలు

జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంతో పాటు యలమంచిలి, నర్సీపట్నం, పాయకరావుపేట, అడ్డరోడ్డు కూడలి, నక్కపల్లి, అచ్యుతాపురం, చోడవరం సహా పలు మండల కేంద్రాలు, ప్రధాన, జాతీయ రహదారుల పక్కన ఎక్కడ చూసినా తాటి ముంజల విక్రయాలు కనిపిస్తున్నాయి.

ఈ సీజన్లో మాత్రమే లభించే తాటి ముంజలను తినడానికి చిన్నపెద్ద తేడా లేకుండా ఎగబడుతున్నారు. వేసవిలో గీత కార్మికులు, కొందరు యువకులకు ముంజల విక్రయాలే ఉపాధినిస్తున్నాయి.

డజను రూ.40 నుంచి రూ.60

ప్రస్తుతం రహదారులకు ఇరువైపులా విక్రయిస్తున్న తాటి ముంజల ధర కాస్త ఎక్కువగానే ఉంది. కొందరు తాటి చెట్లను కొనుగోలుచేసి వాటి నుంచి కాయలను దించి, ప్రధాన రహదారుల పక్కన విక్రయిస్తున్నారు. డజను ముంజల్ని రూ.40 నుంచి రూ.60 మధ్య విక్రయిస్తున్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ముంజల అమ్మకాలు గీత కార్మికులకే కాకుండా కొందరు యువకులకు కూడా జీవనోపాధిగా మారాయి.

పోషక విలువల్లో మేటి

తాటి ముంజల సీజన్ ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకు ఉంటుంది. సీజన్లో మాత్రమే దొరికేవి కావడంతో వీటికి మంచి డిమాండ్ ఉంది. తాటి ముంజలో దాదాపు 87 శాతం నీరే ఉండటంతో శరీర ఉష్ణోగ్రత తగ్గి, జీవక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. తాటి ముంజల్లో కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వు, పీచుపదార్థాలు, కాల్షియం, ఐరన్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా దొరుకుతాయి. ఇవి తింటే ఆకలి పెరుగుతుంది. చిన్నారులు, వృద్ధులకు, హృద్రోగులకు, చక్కెర వ్యాధిగ్రస్తులకు, కేన్సర్, అధిక రక్తపోటు నియంత్రణకు ముంజలు ఎంతగానో మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెప్తారు.

రసాయనాల ముప్పు లేదు

ప్రస్తుతం మార్కెట్లో ఏ పండ్లు, ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలన్నా హానికర రసాయనాలు, కృత్రిమ రంగుల భయం వెంటాడుతూనే ఉంది. రోడ్డుపై విక్రయించే మామిడి, ద్రాక్ష, అరటి, నారింజ, బొప్పాయి, ఆపిల్ ఇలా ఏ పండ్లు కొన్నా.. వాటితోపాటు రసాయనాల ప్రభావాన్నీ వెంట తెచ్చుకున్నట్లే. ఎలాంటి రసాయనాల ప్రభావం లేకుండా పూర్తి ప్రకృతి సిద్ధంగా లభించేవి ముంజలు మాత్రమే. అందుకే చాలా మంది వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతారు.

క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం


అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం విజ్ఞాన సమితి వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయ 7వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు తెల్లవారుజాము నుంచే స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చందు, హరి, ఉషాసాగర్, బాలు, మధు, దాడి శ్రీను, లక్ష్మణరావు, బుద్ద మోహన్, కొయిలాడ పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో థ్రాంబోలైసిస్ ఇంజక్షన్


ఐసీయూ వార్డులో రోగిని పరిశీలిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఎమర్జెన్సీ వార్డ్లో హార్ట్ఎటాక్ వచ్చిన రోగికి 6 గంటల లోపు అందించాల్సిన రూ.40 వేలు విలువ చేసే థ్రాంబోలైసిస్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, వైద్యుడు జి.రామ్మూర్తి తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బడుగు, బలహీన వర్గాల రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయి వైద్యం అందుతోందన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి, వారి కుటుంబ సభ్యుల్లో నమ్మకం పెంచాలని వైద్య సిబ్బందిని సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసిన సీటీ స్కానింగ్ను త్వరలో రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, వైద్యులు జి.కృష్ణ, కృష్ణచంద్ర, మరో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

నటరత్నాలు	:	రాజా
మిరల్	:	సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ద ఏప్స్	:	సత్యనారాయణస్క్రీన్-2
బాక్	:	షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	:	పర్తిసాయి
అపరిచితుడు	:	వెంకటేశ్వర
రత్నం	:	శ్రీసత్య
కృష్ణమ్మ	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్కు మంగళవారం 692 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,460	5,370
మొదటి రకం	3,970	5,060
రెండో రకం	3,800	4,400
మూడోరకం	3,500	3,900

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 99 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-47 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-34 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 328 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నైపుణ్యాల వెలికితీతకు వేసవి శిక్షణ


వెస్ట్రన్ డ్యాన్స్ నేర్చుకుంటున్న చిన్నారులు

అనకాపల్లి: వేసవి సెలవుల్లో చిన్నారులకు వివిధ కళలపై తర్ఫీదు ఇవ్వడం ద్వారా వారిలో నైపుణ్యాలను వెలికి తీయవచ్చని కల్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 10 వరకూ శిక్షణ కొనసాగుతుందన్నారు. చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయాలని నిర్వాహకులను సూచించారు. శిక్షణలో భాగంగా సంగీతం, కూచిపూడి నాట్యం, వెస్ట్రన్ డ్యాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, కీబోర్డు, గిటార్లలో రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ 160 మందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం సినీ ప్రముఖుల అభినందనతో కూడిన జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందిస్తామన్నారు.

ఫణిభూషణ్కు జీవ వైవిధ్య పురస్కారం



అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల పంచాయతీ చిన్నబాబుకాలనీకి చెందిన కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్కు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలోని ఏయూలో రాష్ట్ర స్థాయి అవార్డును బుధవారం అందుకోనున్నట్లు గ్రీన్ క్లబ్ ప్రతినిధి ఎస్.ఎఫ్.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2000 సంవత్సరం నుంచి జీవ వైవిధ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం, సాంప్రదాయక విజ్ఞానం ద్వారా జాగృతి కార్యక్రమాలు చేపట్టడంతో ఆయనకు ఈ పురస్కారం దక్కిందన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నక్కపల్లి: మండలంలోని వెదుళ్లపాలెం ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచి ఆలయంలో హోమాలు, తమలపాకులతో పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అనంతరం భక్తులకి అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

మహిళలు బలవర్ధక ఆహారం తీసుకోవాలి

- సీడీపీవో లలితకుమారి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో లలితకుమారి

సబ్బవరం: మహిళలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించడంతో పాటు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి సూచించారు. సబ్బవరం కోమటివీధిలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం మహిళలు, కిశోర బాలికలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 28 వరకు రుతుక్రమ సమయంలో మహిళలు పాటించాల్సిన పరిశుభ్రత, బలవర్ధకమైన ఆహారం మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తల్లి లేదా తండ్రి ఆ సమయంలో అవగాహనతో వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఆడపిల్లలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. పరిశుభ్రత పాటించకపోవడం వల్ల గర్భాశయ క్యాన్సర్లు ఎక్కువగా వస్తున్నాయని ఆమె తెలిపారు. డెటాల్ సబ్బు ఉపయోగించవద్దని సూచించారు. అదేవిధంగా వేపాకు, పసుపు వేసి మరిగించిన నీటితో స్నానం చేయడం వల్ల చర్మ సంబంధ వ్యాధులు దూరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు ఆర్.పైడితల్లి, వై.రమాదేవి, వై. ఇందిర, ఏఎన్ఎం అనురాధ, మహిళా పోలీస్ నళిని, అంగన్వాడీ టీచర్ ఎం.చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సతివాడమ్మ తల్లి సంబరం


గొరపల్లిలో ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు


సతివాడమ్మతల్లి

పెందుర్తి: గొరపల్లిలో వెలసిన ఏడు గ్రామాల ఆరాధ్య దేవత సతివాడమ్మతల్లి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు జరిపారు. భక్తులు పసుపు-కుంకుమలతో పూజలు చేశారు. చీరలు, ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండాలు తొక్కారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు అట్టహాసంగా సాగింది. ప్రజలు పిండి వంటలు, పలు రకాల పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఏలేసుగు సంబరం అంబరాన్ని అంటింది. ఆనవాయితీగా ఉయ్యాల కంబాల ఘట్టం నిర్వహించారు. భజనలు, డప్పుల వాయిద్యాల నడుమ అనుపోత్సవం వైభవంగా చేశారు. పగటి వేషాలతో యువకులు సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గొరపల్లి, కోట్నివానిపాలెం, గంగమ్మపేట, గొల్లలపాలెం, కరకవానిపాలెం, గవరపాలెం, సంతపాలెం గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

నాగవల్లి వసంతోత్సవం రేపు

కశింకోట: దేవదాయ శాఖకు చెందిన కశింకోటలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 23న నాగవల్లి వసంతోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు మంగళవారం తెలిపారు. వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆ రోజు ఉదయం 8.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24న రాత్రి అష్టదళ పద్మార్చన, శ్రీపుష్ప యాగం (పవళింపు సేవ), ద్వాదశ కాలార్చన, బేడా సేవ స్వామివార్లకు జరుపుతామన్నారు. దీంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

8 మందికి ఐవోఎల్ ఆపరేషన్లు


రోగులతో రోటరీ ప్రతినిధి రవిరామ్ జవహర్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఏఎంఏఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఎనిమిది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్లు రోటరీ ప్రతినిధి రవిరామ్ జవహర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో 21 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 8 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కంటి వైద్యుడు కె.మల్లేశ్వరరావు ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ అనంతరం ఐదురోజులకు సరిపడా మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నేత్ర వైద్య సహాయకురాలు పి.దేవి, రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

కశింకోట: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 23న ఉదయం 10.30 గంటలకు జరగనుందని ఎంపీడీవో కె.శేషుబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నిబంధనలకు లోబడి సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

ముత్యాలమ్మతల్లి పండగ రేపు

పరవాడ: పరవాడ గ్రామంలో కొలువుదీరిన శ్రీబ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగను ఈ నెల 23న వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆ రోజు ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పిస్తారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహిస్తారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, భారీ బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు.

అంతా సామరస్యంగా మెలగండి

- డీఎస్పీ సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ బాలసూర్యారావు

పరవాడ: పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఫలితాలు ఎలా వచ్చినా అంతా సామరస్య పూర్వకంగా మెలగాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. త్వరలో ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో మంగళవారం ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి తదితర గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పండగలు, పబ్బాలు చేపట్టకూడదని సూచించారు. పల్లెల్లో ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు. కార్యక్రమాల్లో పరవాడ సీఐ బాలసూర్యారావు, ఎస్ఐ సిరపరపు సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతక స్వామి కల్యాణం రేపు


శివాలయంలో వెలసిన త్రిపురాంతకస్వామి


సర్వమంగళాంబ

- 108వ కల్యాణోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

కశింకోట: స్థానిక పురాతన శివాలయంలో వెలసిన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి 108వ కల్యాణోత్సవాన్ని గురువారం నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. ఏటా వైశాఖ మాసం పౌర్ణమి రోజున కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీ. సుమారు నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయంలో గత 107 సంవత్సరాలుగా ఏటా స్వామి వారి కల్యాణాన్ని సంప్రదాయంగా జరిపిస్తున్నారు. ఈ ఏడాది నిర్వహించే కల్యాణం 108వది కావడంతో భారీ స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఇప్పటికే స్వామివారి పెళ్లి రాట ఉత్సవాన్ని జరిపారు.

23న సాయంత్రం 6 గంటలకు వేదమంత్రాల నడుమ స్వామివారి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా ఆలయ ప్రాంగణంలో కల్యాణం జరగనుందని ఆలయ అర్చకులు వి.బాబ్జి, వి.కృష్ణ తెలిపారు. మధ్యాహ్నం భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేసినట్లు శివ సన్నిధి గ్రూపు ప్రతినిధులు పెతకంశెట్టి భాస్కరరావు, సూరిశెట్టి సూర్య వెల్లడించారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి


రాజీవ్గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన గంగాధర్


రాజీవ్గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

అనకాపల్లి: రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే యువకులకు ఓటు హక్కు వయసును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. స్థానిక నాయుళ్లవీధి రైల్వేస్టేషన్ రహదారిలో మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలకు వచ్చే విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందన్నారు. దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేసింది కూడా రాజీవేనని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాల అమలుకు నేటి యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దాసరి సంతోష్, సనేడ గజ్జాలు, ఎగ్గాడ భాస్కరరావు, కొల్లి సత్య రావు, టి.సంతోష్, ఏడువాకల దేవుడమ్మ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: దివంగత మాజీ ప్రధాని రాజీవ్గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కశింకోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానిగా దేశానికి ఆయన అందించిన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కత్తెర శ్రీధర్, మల్లపురెడ్డి కోటేశ్వరరావు, పీఎస్ దత్తు, బోయిన భానుమూర్తి, తుట్ట రమణ, కాళ్ల సత్యనారాయణ, సేనాపతి రాజు, మాడేపు నాయుడు, బుద్ధ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గజ్జాలమ్మ ఉత్సవం


గజ్జాలమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్న భక్తులు


ఆలయానికి చుట్టూ అందంగా అలంకరించిన పూలమాలలు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో రెండేళ్లకోసారి నిర్వహించే గజ్జాలమ్మ ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని, ఆలయాన్ని పూలమాలలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై అమ్మ వారిని దర్శించుకున్నార. చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్రాజు, సర్పంచ్ ఎస్.శివ, ఎంపీటీసీ సభ్యురాలు కన్నూరు అచ్చియమ్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారి జాతర ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఘటాలతో అమ్మవారిని ఊరేగించారు. ఉత్సవం సందర్భంగా ఆలయం నుంచి గ్రామ శివారు వరకు విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన వివిధ దేవతామూర్తుల కటౌట్లు ఆకట్టుకున్నాయి. ప్రజలు ఉత్సాహంగా ఉత్సవంలో పాల్గొన్నారు.

పీఎండీఎస్ విత్తనాల సాగుతో భూములు సారవంతం


సుందరయ్యపేటలో పీఎండీఎస్ విత్తనాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కశింకోట: ప్రకృతి వ్యవసాయ పద్ధతిల ద్వారా తమ పంట భూములను రైతులు సారవంతం చేసుకోవాలని మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు, ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి కూండ్రపు అరుణ సూచించారు. మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులకు తొలకరిలో భూమిని సారవంతం చేసుకునేందుకు ఉపకరించే పీఎండీఎస్ 30 రకాల కూరగాయల విత్తనాల కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ లత్సన్న ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో పీఎండీఎస్ విత్తనాల సాగుపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట భూములను సారవంతం చేసుకోవడానికి పీఎండీఎస్ విత్తనాలను తొలకరి వర్షాల్లో జల్లుకోవాలన్నారు. ఇవి 45 రోజుల్లో ఏపుగా ఎదుగుతాయన్నారు. వీటిని నేలలో కలియ దున్నుకుంటే సహజసిద్ధ ఎరువుగా ఉపయోగపడతాయన్నారు. హానికరమైన కృత్రిమ ఎరువులు వాడాల్సిన పని ఉండదన్నారు. ఎకరా భూమికి 12 కిలోల పీఎండీఎస్ విత్తనాలు సరిపోతాయన్నారు. వీటిని ఒక కిట్గా రూ.800కే ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. వీటిని ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న 13 గ్రామాల రైతులు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సాగు రైతులు పాల్గొన్నారు.

శిథిలమైన పోలీస్ క్వార్టర్స్ తొలగింపు


శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్స్ను తొలగిస్తున్న దృశ్యం

అనకాపల్లి: పట్టణ పోలీస్స్టేషన్ సమీపంలో శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్స్ను మంగళవారం కూల్చివేశారు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. రాత్రుళ్లు ఆ దారిలో వెళ్లాలన్నా భయమే. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జేసీబీ సాయంతో ఒక్కో శిథిల భవనాన్ని తొలగించారు.